# బొమ్మరిల్లు

## ★ త్యాగం ★

రచన: మసూనా.

పాపల్లారా
పాపల్లారా
ఇది వింటారా
విని చెప్తారా ?

ఏరు మంచిది,
ఎందుకు మంచిది,

త్రాగేనీరూ
స్నానంనీరూ
పంటల నీరూ
తెస్తుందీ తెస్తుందీ-

చెట్టుమంచిది
ఎట్లు మంచిది?

కమ్మని పూలూ
కాయలు పండ్లూ
కలపాకట్టెలు
ఇస్తుందీ యిస్తుందీ-

ఆవుమంచిది
ఏల మంచిది?

పాలూ పెరుగూ
నేయీ మజ్జిగ
జున్నూ వెన్నా
అన్నీ యిస్తుందీ-

అన్నీ ఎన్నో యిస్తాయి
ఎన్నో అన్నీ యిస్తాయి.
అన్నీ యిచ్చే పద్ధతినీ
అందరు త్యాగం అంటారు.

అన్నిటికీ మించిన సత్కార్యం
త్యాగం గొప్పది అంటారు—
ఎద్దులు దున్నుట కోసం
గుఱ్ఱం స్వారీ కోసం
ఆవూ ఏరూ చెట్టూ
అన్నీ మనుషుల కోసం
త్యాగం చేస్తూ వుంటే
మనుషులు మనుషుల కోసం
పని కొస్తామని చెప్తారా?

పాపల్లారా
పాపల్లారా
యిది వింటారా ?
విని చెప్తారా ?

## మంచివెన్న

శ్రీ వేజండ్ల సాంబశివరావు

★

ఉట్టిపైన మంచివెన్న
అందకుండ ఉన్నది
మనసుఅంత దానిమీద
వేగనిలచి ఉన్నది

ఎత్తుబల్ల ఎక్కి నేను
వెన్నముద్ద తిందునా?
పిల్లికూన నడిగి వెన్న
ముద్దపెట్ట మందునా?

ఎత్తుబల్ల ఎక్కిచూడ
ఉట్టి అందలేదురా
పిల్లికూన చట్టిమూత
తీయలేక పోయరా

మంచితల్లి నాకు ఉండ
దొంగతనము కూడునా ?
వెన్నముద్ద పెట్టమంచు
అమ్మనిపుడె అడగనా?